# లలిత పెళ్ళి

నిన్నటిదాకా కుమారిగా ఉన్న లలిత నేటి ఉదయం ఒక శుభ ముహూర్తాన అంటే తొమ్మిదిన్నరకు శ్రీమతి లలితాఆనందరావుగా మారడం చూసి ఆ ఊళ్లో వాళ్ళంతా ఆశ్చర్యాంబుధిలో మునిగిపోయారు. పనీపాటు లేని కొంతమంది అమ్మలక్కలు 'ఏం కుంభకోణం జరిగిందో మనకేం తెలుసు? లేకపోతే యిప్పుడేం పెళ్ళి, మనమల్ని ఎత్తుకునే వయసులో!' అని తమలో తాము అనుకున్నారు. ఆ మాటలు పైకి అనేవారే. కాని అందుకు ధైర్యం చాలలేదు ఆ పని శ్రీమతి లలిత కాక మరో స్త్రీ కనక చేసినట్టయితే, యీ పాటికి ఊరంతా రకరకాల కథలతో కంపు కొట్టి వుండేది. పిచ్చి పిచ్చి వ్రాతలతో గోడలు అసహ్యంగా కనిపించి వుండేవి. ఊరి పెద్దల నోళ్ళకు సంవత్సరానికి సరిపడ్డ గ్రాసం లభించి వుండేది.

ఆడూళ్లో ఒక పురుషుల కళాశాల, ఒక స్త్రీల కళాశాల, మూడు ఉన్నత పాఠశాలలు, నాలుగయిదుబ్యాంకులు, తాలూకాఫీసు మరికొన్ని ప్రభుత్వ కార్యలయాలు మొదలైనవి ఉన్నాయి. ఆఫీసర్ల యిళ్ళలో ఏం జరిగినా, ఊరి పెద్దలు ఎలాంటి ఘనకార్యం చేసినా, అది వెంటనే ఊరంతా వ్యాపిస్తుంది.

శ్రీమతి లలిత స్త్రీల కళాశాలలో రసాయన శాస్త్ర శాఖకు అధిపతి. వైస్ ప్రిన్సిపాలు కూడా. వయస్సు నలభై దాటింది. ఆమె అందగత్తె కాక పోయినా, అనాకారి మాత్రం కాదు. కాని ఆమెలో ఏదో ఆకర్షణశక్తి ఉంది. స్వభావం మంచిది. అందరికీ తలలోని నాలుకలా ఉంటుంది. కళాశాలలోనే కాదు, ఆడూళ్లో ఏ సాంస్కృతి సభ జరిగినా, అందులో ఆమెకు ప్రముఖ పాత్ర ఉంటుంది. అందువల్ల ఊళ్లో ఆమె అందరికీ పరిచితమైన వ్యక్తి.

ఉన్నట్టుండి లలిత ఎందుకు పెళ్ళి చేసుకుంది? ఎవరికి వారు ఈ ప్రశ్న వేసుకుని, వాళ్ళే ప్రత్యుత్తరం కూడా చెప్పుకున్నారు. కొందరి సమాధానాలు ఆమె చెవుల్లో గుసగుస లాడాయి; కొందరివి ఆమె గుండెల్లో బాకులయ్యాయి.

అందరూ తనను గురించిమాట్లాడు కోవడం చూసి ఆమె మొదట్లో విస్తుపోయింది. తానేదో మహాపచారం చేసినదానిలా వాళ్ళు భావించడం చూసి మండిపడింది. తాను తప్పుపని యేమీ చెయ్యలేదు. పెళ్ళి చేసుకోవాలనిపించింది. చేసుకుంది. లోకానికి సంజాయిషీ చెప్పవలసిన అవసరం తనకు లేదనుకుని తృప్తి పడింది. కాని...రేపు...కాలేజికి వెడితే విద్యార్థినులు తప్పకుండా తనను గురించే మాట్లాడుకుంటారు...నవ్వుతారు కూడా...అది భరించడం కష్టం. కష్టమే కాదు యమ యాతన కూడా!

లలితకు చెమటలు పోశాయి. ఆలోచనలో పడింది. అలా కొంతసేపు గడిచింది. తర్వాత ధైర్యం తెచ్చుకుంది. తన అంతరాత్మకు అసలు విషయం తెలుసు ననుకుని తృప్తి పడింది. ఒక్కసారి జరిగిన విషయాలన్నీ స్ఫురణకు వచ్చాయి.

ఆమె బి.యస్సి చదువుతున్న రోజుల్లో, నాలుగైదు సంబంధాలు చూశారు. పెళ్ళి చూపులు కూడా జరిగాయి. పిల్లవాని తల్లికి నచ్చక ఒక సంబంధం తప్పిపోయింది. పిల్లవాని తండ్రికి నచ్చకపోవడం వల్ల ఒక సంబంధం వదులుకోవలసి వచ్చింది. పిల్లవాడికి నచ్చినా యింకొకసంబంధం ముడిపడలేదు. ఈ ముగ్గురికీ నచ్చినా, కట్నం కారణంగా ఇంకో సంబంధం తప్పిపోయింది. అదృష్టవశాన అన్నీ అనుకూలంగా వున్నా, పిల్లకు పిల్లవాడు అంతగా నచ్చకపోవడం వల్ల కుదురుతుందనుకున్న ఆ సంబంధం కూడా తప్పిపోయింది.

ఇలా ఏదో ఒక కారణంవల్ల, వచ్చిన సంబంధాలన్నీ వెనక్కి తిరిగి పోవడంతో లలితకు పెళ్ళంటే అసహ్యం పుట్టింది. అయినప్పుడే అవుతుందిలే అనే మెట్టవేదాంతం బలపడసాగింది. ఇంతకూ కళ్యాణ ఘడియతోసుకురాలేదు అని తల్లి సరిపుచ్చుకుంది. కాని ఉద్యోగంను

అప్పుడే రిటైరైన తండ్రి మాత్రం అనుకోలేక పోయాడు. ఉద్యోగంలో వుండగా ఒక్కగాని ఒక్క కూతరు పెళ్ళి చెయ్యలేక పోయాను; ఇక రిటైరయిన తర్వాత ఏం చేస్తానని దిగులు చెందసాగాడు. ఆ దిగులుతోనే ఆయన మంచం ఎక్కాడనీ, ఒక రోజు హరీ అన్నాడనీ ఆ యిరుగు పొరుగు వాళ్ళ కథనం, కాని గుండె పోటు వచ్చి మరణించినట్లు డాక్టరు గారి తీర్పు. ఏమయితేనేం, లలితకు తండ్రి కరువయ్యాడు. పైగా నా మూలానే తండ్రి ఆరోగ్యం దెబ్బతిన్నదనే విచారం ఆమెను పట్టిపల్లార్చ సాగింది.

ఆ తర్వాత లలితకు పెళ్ళి కాలేదు యం.యస్సి. పూర్తిచేసింది. అప్పుడు మరీ మంచిసంబంధాలు రావడంచాలా కష్టమయింది. తల్లి ఆరోగ్యం అంత తృప్తికరంగా లేకపోవడం కూడా అందుకు తోడయింది.

ఉద్యోగంలో చేరినకొత్తలో లలితకు రెండు మంచి సంబంధాలు వచ్చాయి. ఒకతను బి.యల్. ప్యాసయి ప్రాక్టీసు చేస్తున్నాడు. వెనకాల ఆస్తికూడా వున్నట్టు వినికిడి. అతని పేరు ఆనందరావు. ఇంకొకతను యంయే, ఇంగ్లీషు లిటరేచర్ చేసి పి.హెచ్‌డికి సిద్ధాంత వ్యాసం సమర్పించాడు. ఉద్యోగం చేస్తున్నాడు, ఈ రెండింటిలో ఏదో ఒకటి అయితే బాగుంటుందని అనుకుంది లలిత. కాని ఆనందరావు బోలెడు కట్నంతో నగానట్రాగల నవయువతిని పెళ్ళి చేసుకున్నాడు. రెండో అతను హఠాత్తుగా కన్ను మూశాడు. దాంతో లలిత మనస్సు వికలమైపోయింది. పెళ్ళంటే భయమూ విరక్తీ కలిగాయి.

కాలం గడిచిపోతోంది.

సరిగ్గా పదిరోజులక్రితం అప్పుడే లలిత కాలేజీనుంచి వచ్చి వీధి గుమ్మంలో అడుగుపెడుతుంటే లోపల్నుంచి ఆనందరావు బయటికి వస్తున్నాడు. వస్తున్నవాడల్లా ఆమెనుచూసి బెల్లం కొట్టిన రాయి అయ్యాడు. అడుగు ముందుకు వెయ్యలేకపోయాడు. అతని వైఖరిచూసి అసహ్యించుకుంటూ ఆమె యింట్లోకి వెళ్ళిపోయింది.. యింట్లో రెండు భాగాలు, పెద్ద భాగంలో ఉద్యోగ విరమణచేసి విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా జడ్జిగారుంటున్నారు. చిన్న భాగంలో లలిత వుంటోంది.

వెనక్కి తిరిగివెళ్ళి, ఆనందరావు వరండాలో ఉన్న ఒక పేముకర్చీలో కూలబడ్డాడు, నెరిసినతలా, లోతుకు పోయిన కళ్ళూ, వాడిపోయిన ముఖం, ఉత్సాహం లేని చూపులూ...ఇలా కనిపిస్తున్న ఆనందరావుకీ పూర్వపు ఆనందరావుకీ సంబంధంలేదు. పరిచయస్థులు తప్ప మిగిలినవాళ్ళు అతన్ని సులభంగా గుర్తుపట్టలేరు.

'ఏమోయ్ ఆనందం... నువ్విక్కడే వున్నావన్నమాట...ఎక్కడికో వెడతానని యిందాక బయల్దేరావు..' అది జడ్జీగారి గొంతు. ఆనందం అని వినిపించేసరికి లలిత నిర్ఘాంతపోయింది.

తాను చూసింది ఆ ఆనందరావేనా!... పెళ్ళిచూపులనాడు నల్లగా నిగనిగలాడే క్రాపు, సన్ననిమీసకట్టు, ఉత్సాహం పొంగిపొరలే చూపులు, ఏదో ఆకర్షణశక్తిగల కళ్ళు...ఆ ఆనందరావేనా! పాపం ఎలా మారిపోయాడు!...ఎందుకో ఒకసారి అతన్ని చూడాలనుకుని వరండాలోకి దారి తీసింది.

జడ్జీగారిగొంతు వినిపిస్తోంది.

లలిత తలుపుచాటున నిలబడింది.

''ఏమిటోయ్ ఆనందం, యింతలో యిలా మారిపోయావ్, షాక్ తిన్న వాడిలా...''

''...........''

''నిన్నే.....''

''బాబాయ్, ఈ పక్క వాటాలో ఎవరుంటున్నారు?''

''లలితగారని...వుమెన్స్‌కాలేజీలో కెమిస్ట్రీ ప్రొఫెసరు...వైస్ ప్రిన్సిపాలు కూడా...చాలా యోగ్యురాలు...''

''అలాగా''

రెండు క్షణాలు నిశ్శబ్దం.

కుర్చీలోంచి లేస్తూ ఆనందరావు, ''వెళ్ళేలోగా నిన్ను మళ్ళీ కలుసుకుంటాను...'' అన్నాడు, ''బాబాయ్! లలితగారి భర్త ఏం చేస్తుంటారు!''

ఆమె గుండెలు కొట్టుకున్నాయి.

''ఎందుకోగాని ఆవిడ పెళ్లిచేసుకోలేదు...''

"వస్తా" అంటూ ఆనందరావు అడుగులో అడుగువేసుకుంటూ వీధిలోకి వెళ్ళాడు. అతను వెళ్ళినవైపే చూస్తూ జడ్జీగారు "...ఏమిటో... అప్పుడే ముసలివాడై పోయాడు.. చిన్నప్పుడు ఎంత చలాకీగా వుండే వాడు...ఇంకా వాడిమనస్సు ఆదిక్కుమాలిందానిమీదే వున్నట్టుంది...." అని గొణుక్కోవడం లలితకు వినిపించింది.

రెండు నిముషాలు మౌనంగా గడిచాయి.

లలిత వరండాలోకి వచ్చేసరికి, జడ్జీగారు వీధిగేటుపక్క ఎండిపోతున్న గులాబిమొక్క వంక వెర్రిగా చూస్తున్నారు.

ఆమె అడుగుల సవ్వడి విని, గులాబిమొక్కలనుంచి దృష్టి మరల్చి లలిత నుద్దేశించి, "రా అమ్మా, యిలా కూర్చో" అంటూ తన యెదురుగా వున్న కుర్చీ చూపించాడు.

"ఇందాక మీరన్నమాటలు విన్నాను..." ఆమె యింకా తనమాట పూర్తి చెయ్యలేదు.

"ఎందుకు చెపుతావులే వాడి విషయం..." అంటూ జడ్జీగారు మొదలు పెట్టారు ఆయన గొంతులో జాలీ సానుభూతి కనిపించాయి.

"వాడు లా ప్రాసయి ప్రాక్టీసు పెట్టాడు. ఏరి కోరి ఒక అందగత్తెను పెళ్లిచేసుకున్నాడు...అందం చూశాడే కాని యితర విషయాలు చూడలేదు. ఇద్దరు పిల్లల్ని కన్నతర్వాత, అది కాస్తా లేచిపోయింది. అప్పట్నుంచీ ఆ పిల్లల్ని పోషించుకుంటూ...యిలా తయారయ్యాడు..."

రెండు క్షణాలపాటు ఎవ్వరూ మాట్లాడలేదు.

వరండాలోని మొజాయిక్ నేలను కాలి బొటన వేలుతో రాస్తూ "రావుగారిని పెళ్ళి చేసుకుంటానండి..." అంది లలిత నెమ్మదిగా.

జడ్జీగారు నిర్ఘాంతపోయారు. ఆయన ఆ ఆశ్చర్యంలోంచి తేరుకోక మునుపే లలిత యిలా చెప్పింది. "పెళ్ళి నా కోసం కాదు... తల్లి కరువైన ఆ పిల్లలకోసం..." జడ్జీగారు ఆమెవైపే చూస్తుండి పోయారు. ఆమె అంత రాత్మ ఆమెను ప్రశంసించింది. మంచిపని చేశావు. నీ మాతృత్వవాంఛను తీర్చు కోవడంతో పాటు, తల్లి తండ్రీలేని నీవు ఒక తోడును సంపాదించుకున్నావు.

గులాబి మొక్కకు జడ్జీగారి భార్య నీళ్ళు పోస్తోంది.